రాధ. ఆర్

# చెంపదెబ్బ



ఫ్యాన్సీ షాపు కట్టేసి ఇంటికి బయలుదేరాడు శేఖర్. అప్పుడు సమయం పద కొండు గంటలు కావస్తోంది. వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి.

రామాలయం పక్కనున్న మురికివాడ మీదుగా చకచకా నడిచి వెళుతున్నాడు శేఖర్.

భార్య పుట్టింటికి వెళ్ళింది. ఆమె లేక పోవడంతో తనవంట తనే చేసుకోవాల్సి వచ్చింది. మొదట్నుంచి తను ప్రత్యేకంగా ఉండేవాడు. దాంతో చాలామంది ఎగతాళి చేసేవారు. ప్రాణం మీదకొచ్చినా హోటల్‌కి వెళ్ళడు.

ఈ కారణంగానే భార్య పుట్టింటికి వెళ్ళినప్పటికీ తనే ఉదయం కొట్టుకు బయలు దేరేముందే వండుకుని కాస్త తిని మిగిలింది రాత్రికి ఉంచుకుని కొట్టుకొచ్చాడు.

భర్త మనస్తత్వం తెలిసిన శేఖర్ భార్య వెళ్తూ రెండు పచ్చళ్ళు చేసి వెళ్ళింది. వాటితోనే కాలం గడిపేస్తున్నాడు.

కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయ్. ఆకలి విపరీతంగా ఉంది. అందుకే చకచకా నడుస్తున్నాడు.

శేఖర్ ఇంకా మురికి వాడదాటలేదు. ఆ వాడదాటి ఇంక రెండు వీధులు దాటితే అతని ఇల్లు వచ్చేస్తుంది.

"ఏమండోయ్ మిమ్మల్నే" ఆ పిలుపుకి ఉలిక్కిపడి వెనక్కి చూశాడు శేఖర్.

ఆమె తనని ఎందుకు పిలుస్తుందో అర్థం కాక ఆమె వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"మిమ్మల్నే రండి" అందామె.

శేఖర్‌కి ఏమి అర్థంకావడంలేదు. అలాగే నడుస్తూ ఆమె దగ్గరికి వచ్చి నిలబడ్డాడు.

"లోపలికి రండి" అందామె.

ఆమె ఎందుకు ఆహ్వానిస్తుందో అతడికి అర్థం కాలేదు. పరీక్షగా చూశాడామెను.

పాతికేళ్ళలోపు ఉంటుంది వయసు.

చెప్పుకోదగ్గ అందగత్తేమీకాదు. కానీ నిండయిన శరీరం ఆమెది.

"పిలుస్తుంటే అలా బొమ్మలా నిలబడి పోయారేం? రండి లోపలికి" మళ్ళీ పిలిచింది.

అతడు కదల్లేదు. మొద్దుబారిన మెదడు పనిచేయడం ప్రారంభించింది.

తను ఎంతోకాలంగా ఈదారిన నడుస్తున్నాడు. కానీ తనకెలాంటి కేసూ తగల్లేదు. అసలే మురికి వాడ అలాంటిది కాదే? పేరుకు ఇది మురికి వాడే అయినా ఇక్కడుండే వాళ్ళంత నిజాయితీగా కష్టంమీద బతికే వాళ్ళే. అలాంటి బాపతే!కాదే! ఏమో పరిస్థితుల్ని బట్టి మనుషులు మారొచ్చు. ఎప్పుడు ఒకేలా ఉండరు కదా!

ఈమె బాగానే ఉంది. బాగా అనుభవించొచ్చు. ఎలాగూ భార్య గూడా ఇంట్లో లేదు. కాబట్టి తెల్లారేవరకూ ఇక్కడే ఉండిపోవచ్చు. మురికి వాడలో ఉంటోందికాబట్టి రేటుకూడా పెద్దగా ఉండదు.

ఈ విధంగా ఆలోచించిన శేఖర్ మెల్లిగా నోరువిప్పి "నాకు ముందు మంచి ఇలాంటివి అలవాటు లేదు. అయినా పిలుస్తున్నావు కాబట్టి వస్తున్నా! రేటెంత?"... కసిగా కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"రేటా! ఏమిటి మీరనేది?" అందామె ఆశ్చర్యపోతూ

"మువ్వు ఆ రకం కాదా?" మీమోహంచూసి ఏదో సంస్కార వంతులని పిలిచాను. మా నాన్న కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆయనను హాస్పటల్‌కి చేర్చాలి. సహాయంగా ఉంటారని పిలిచాను. అంతే" అందామె అతడ్ని అసహ్యంగా చూస్తూ.

శేఖర్‌కి లాగి చెంపమీద కొట్టినట్టయ్యింది. అతడిముఖంలో కత్తివేటుకి నెత్తురు చుక్కలేదు. *



# ఆట

బుజ్జి

"వ్వారింత వేతకావిడద్దమ్మని నేను ఊహించలేకపోయానండి. మన వివాహమై మూడు రోజులే అయింది. మూడురోజులుగా ఆడుతున్నారు. ఏం లాభం? చెమట్లు పట్టడం తప్ప గురిచూసి కొట్టలేకపోతున్నారు. ఈ రోజుల్లో స్కూలు పిల్లలకున్నంత నైపుణ్యం కూడా మీకు లేదంటే చాలా ఆశ్చర్యంగా వుంది. పోనీ నేను నేర్పుతానంటే పెద్ద పౌరుషం. అప్పటికీ బలవంతంగా కోని నేను చేత్తో పట్టుకుని కొట్టమన్నా ఎక్కడెక్కడో కొడుతున్నారు. నా పోరు భరించలేక ఆడుతున్నారే గాని యీ ఆటలో వున్న మజా, థ్రిల్ మీకు తెలిసినట్టు లేదు. మీకన్నా రామం బావ నయం. ఆడినప్పుడల్లా నన్ను చిత్తు చేసేవాడు. ఒకరికొకరు పోటీపడి ఆడేవాళ్ళం. రామం బావ పెళ్ళి చేసుకుని లక్ష్మికి ఈ ఆట నేర్పేసాడు. ఇద్దరూ ఆటలో పడ్డారంటే ఇక చెప్ప లేమండి, వాళ్ళు ఆనంద డోలికల్లో విహరిస్తారా అనిపిస్తుంది. ఉజ్జీ కూడా సమానంగా వుండాలండీ లేకపోతే ఆటలో చెమకులు, చెణుకులు ఎలా తెలుస్తాయి? ఆడితే రక్తి కట్టాలండీ. అప్పుడే మజా. మీ స్నేహితులైనా మీకు చెప్ప లేదా ఈ ఆట ఎలా ఆడాలో? మీరేమీ అనుకోపోతే రేపు రామం బావని రాత్రికి డిన్నరుకి పిలుస్తాను. డిన్నరయిన తరువాత ఒక్క అరగంట నేను, బావా ఆడతాం. ఎంత మజాగా వుంటుందో చూస్తే మీకే తెలుస్తుంది ఏమంటారు." భార్య మాటలు విన్న సుబ్బారావుకి అరికాలు మంట నెత్తికెక్కింది. ఎన్ని దమ్ములు లేకపోతే అంత చులకనగా మాట్లాడుతోంది - కేరమ్స్‌లో ఎంత స్టేట్ ఛాంపియన్‌షిప్ గెల్చుకుంటే మాత్రం! *